క్లుప్తంగా

వైఎస్సార్ బీమా అందజేత



లబ్ధిదారుకు బీమా సహాయం అందజేస్తున్న కార్పొరేటర్ తోట పద్మావతి

అల్లిపురం : ఇంటి పెద్దను కోల్పోయిన కుటుంబానికి కష్టకాలంలో వైఎస్సార్ బీమా అండగా నిలుస్తుందని 34వ వార్డు కార్పొరేటర్ తోట పద్మావతి అన్నారు. వార్డులో అచ్చియ్యమ్మపేట సచివాలయం పరిధిలో నీలమ్మగుడి ప్రాంతంలో నివసిస్తున్న రామలక్ష్మి గత రాత్రి గుండెపోటుతో మృతి చెందింది. ఈ మేరకు తోట పద్మావతి మృతురాలి కుటుంబ సభ్యుడు కనకరాజుకి బీమా సొమ్ము తక్షణ సహాయంగా రూ.10 వేలు అందజేశారు.

కుట్టుమిషన్ల పంపిణీకి హామీ



కుట్టుమిషన్లు ఇప్పించాలని విల్లూరికి వినతిపత్రం అందజేస్తున్న మహిళలు

జగదాంబ : కుట్టుమిషన్లు పంపిణీ చేస్తామని జీవీఎంసీ 35వ వార్డు కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు మహిళలకు హామీ ఇచ్చారు. ఈ మేరకు వార్డులో డాన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శిక్షణ పొందిన మహిళలు తమకు జీవనాధారం కోసం కుట్టుమిషన్లు ఇవ్వాలంటూ కార్పొరేటర్‌కు వినతిపత్రం అందజేశారు. స్పందించిన విల్లూరి తక్షణమే ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ దృష్టికి ఈ విషయం తీసుకెళ్లి పరిష్కారం చేసే దిశగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

పలు వ్యాధులపై అవగాహన



వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న వైద్యులు

మహారాణిపేట : ఇండియన్ సొసైటీ ఆఫ్ క్రిటికల్ కేర్ మెడిసిన్ (ఐఎస్‌సీసీఎం) విశాఖపట్నం చాప్టర్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం బుధవారం జిల్లా పరిషత్ సమీపంలో ఉన్న అంకోసాలో జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రముఖ చార్టెడ్ అకౌంటెంట్, రోటరీ క్లబ్ వైజాగ్ అధ్యక్షుడు డి.ఎం.రావు పాల్గొన్నారు. డాక్టర్ కుచేలబాబు, డాక్టర్ రవీంద్రబాబు తదితరులు పలు వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో విశాఖ చాప్టర్ అధ్యక్షురాలు డాక్టర్ టి.లక్ష్మి రాణి, కార్యదర్శి డాక్టర్ రమాదేవి, వైద్యులు ఎస్.అనూరాధ, మంజుల, వరలక్ష్మి, భవ్య, డాక్టర్ రవికృష్ణ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నేడు మృతుల సంస్మరణ దినం



ఏర్పాట్లపై రెవరెండ్ ఫాదర్ జాన్‌ప్రకాశ్‌తో మాట్లాడుతున్న కార్పొరేటర్ పూర్ణిమ

కంచరపాలెం : కాన్వెంట్ కూడలిలో నవంబర్ 2 గురువారం మృతుల సంస్మరణ దినం (సమాధుల పండగ) నిర్వహించనున్నట్లు జ్ఞానాపురం పునీత పేతురు ప్రధాన దేవాలయం చర్చి రెవరెండ్ ఫాదర్ జొన్నాడ జాన్‌ప్రకాశ్ తెలిపారు. ఈ సందర్భంగా మత గురువులు, క్రైస్తవులు శ్మశాన వాటికల్లో ప్రత్యేక ప్రార్థనలు చేయనున్నట్లు తెలిపారు. వేడుకల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యురాలు, వార్డు కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ తెలిపారు.

ప్రజారోగ్యమే పరమావధిగా..

- జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాల నిర్వహణ
- సీఎం జగన్ ముందు చూపును కొనియాడుతున్న ప్రజలు
- అచ్చియ్యమ్మపేట సచివాలయం పరిధిలో 622 మందికి పరీక్షలు

ఇంటింటికీ వెళ్లి ముందుగా వైద్య పరీక్షలు చేయటం.. అప్పుడు నమోదు చేసిన వివరాలకు అనుగుణంగా రోగులను నిర్ధారించి వైద్య శిబిరాలు నిర్వహించటం జగనన్న ముందు చూపునకు నిదర్శనమని ప్రజలు కొనియాడుతున్నారు. శిబిరాల్లో వైద్యులు ఎంతో శ్రద్ధగా తనిఖీలు చేస్తున్నారని.. మందులు అందిస్తున్నారని సంతోషం వ్యక్తం చేస్తున్నారు. పేదల కోసం సీఎం జగన్ మంచి కార్యక్రమం అమలు చేస్తున్నారని ముక్తకంఠంతో పేర్కొంటున్నారు.



చిన్నారికి చుక్కల మందు వేస్తున్న ఆశ వర్కర్



పోషకాహారంపై అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

అల్లిపురం : ప్రజారోగ్యమే పరమావధిగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తీర్చిదిద్దిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి వాడవాడలా ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారు. పరీక్షలు, వైద్యం కోసం తరలి వస్తూ సేవలందుకుంటున్నారు. అందులో భాగంగా బుధవారం జీవీఎంసీ 34వ వార్డు అచ్చియ్యమ్మపేట సచివాలయం పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేలో ఎంపికైన వారి కోసం వైద్య శిబిరం నిర్వహించారు. కొబ్బరితోటలోని డాక్టర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్‌లో నిర్వహించిన వైద్య శిబిరంలో మొత్తం 622 మందికి పరీక్షలు నిర్వహించారు. వారిలో ఐదుగురిని మరింత మెరుగైన వైద్యం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. మిగిలిన వారికి ఆర్థోపెడిక్, ఆప్తమాలజీ, గైనకాలజీ వైద్యులు పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు.

పోషకాహారంపై అవగాహన..

గర్భిణులు, బాలింతలు, మహిళలకు అంగన్‌వాడీ కార్యకర్తలు పోషకాహారం వలన కలిగే ప్రయోజనాలను వివరించారు. చిరుధాన్యాలు, రాగిపిండి, పాలు తదితర పదార్థాలతో కలిగే లబ్ధి గురించి బోధపరిచారు. ప్రతి రోజు ఒక గుడ్డు తీసుకోవాలని, మునగాకు, తోటకూర, బచ్చలికూర తీసుకోవడం వల్ల సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అచ్చియ్యమ్మపేట సచివాలయం పరిధిలో గల కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు, సచివాలయం, వైద్య సిబ్బంది, ఆశ వర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, పార్టీ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.



కొబ్బరితోట పీహెచ్‌సీలో పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

కమిషనరేట్‌లో రాష్ట్రావతరణ వేడుకలు

దొండపర్తి : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ వేడుకలను పోలీస్ కమిషరేట్‌లో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు చేసిన కృషి, దీక్ష ఫలితంగానే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడిందని తెలిపారు. భాషాప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. ఆయన జీవితం నేటి తరానికి ఆదర్శప్రాయమన్నారు. ఈ కార్యక్రమంలో డీసీపీ-1 కె.శ్రీనివాసరావు, డీసీపీ-2 కె.ఆనందరెడ్డి, డీసీపీ (క్రైం) జి.నాగన్న, ఏడీసీపీలు, ఏసీపీలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



పొట్టి శ్రీరాములు చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న సీపీ డాక్టర్ రవిశంకర్

నేడు సహస్ర తులసీ దళార్చన

డాబాగార్డెన్స్ : కనకమహాలక్ష్మి దేవాలయంలో గురువారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు సహస్ర తులసిపూజ నిర్వహించనున్నారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806091లో చెల్లించాలి. ఆన్‌లైన్ ద్వారా ట్రాన్స్‌ఫర్ చేసిన భక్తులు వివరాలు, పూజ జరిపించాల్సిన వారి పేరు, గోత్రనామాలు, పూర్తి చిరునామా 8985515989 నంబరుకు వాట్సప్ చేయాలి.

రూ. 78.61 లక్షలతో గోకుల్ పార్క్ అభివృద్ధి

డాబాగార్డెన్స్ : తీర ప్రాంతాలను అభివృద్ధి చేస్తామని మేయర్ గొలగాని హరి వెంకటకుమారి పేర్కొన్నారు. జోన్-4 పరిధి 29వ వార్డు బీచ్‌రోడ్డు గోకుల్‌పార్క్‌ను సుమారు రూ.78.61 లక్షలతో చేయనున్న అభివృద్ధి పనులకు స్థానిక ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్, వార్డు కార్పొరేటర్ ఉరుకుటి నారాయణరావుతో కలిసి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ విశాఖ నగరానికి సువిశాల తీర ప్రాంతం ఉందని, ఎంతో మంది సందర్శకులు, పర్యాటకులు నగరానికి వస్తూ ఉంటారని, వారికి ఆహ్లాదం కల్పించేందుకు తీర ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి విశాఖ తీర అభివృద్ధికి కోట్లాది రూపాయలు వెచ్చించి అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారని, ఆ దిశగా పనులు జరుగుతున్నాయన్నారు. ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ మాట్లాడుతూ త్వరలో విశాఖపట్నం పరిపాలన రాజధాని అవుతున్న దృష్ట్యా విశాఖ నగరానికి ఒక ప్రత్యేక గుర్తింపు ఉందని, ఎంతో మంది పర్యాటకులు, సందర్శకులు నగరానికి వస్తుంటారని, వారికి ఆహ్లాదకర వాతావరణం కల్పించేందుకు తీర ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తున్నామన్నారు. రూ.19.45 లక్షలతో పీఠంతో కూడిన కాలియా స్నాక్ మోడల్‌తో శ్రీకృష్ణ భగవానుని ప్రతిష్టాపన, రూ.19.93 లక్షలతో పెడస్టల్‌తో శ్రీకృష్ణ భగవానుని మోడల్ ఇన్‌స్టాలేషన్, రూ.19.60 లక్షలతో వాకింగ్ ట్రాక్, గోకుల్ పార్క్ లైటింగ్ ఏర్పాటు చేయనున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ శివప్రసాద్, జీవీఎంసీ కార్యనిర్వాహక ఇంజినీరు సత్యనారాయణ, పార్టీ నాయకులు పీతల వాసు, సనపల రవీంద్రభరత్, ఆదివిష్ణు, రాజాపాత్రుడు, కంచర్ల రవి, సురేష్, మహేష్, సతీష్, శ్రీనివాస్, వెంకటరమణ, రాజు, శ్రీను, కనకరాజు కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది, కన్వీనర్లు, గృహసారథులు పాల్గొన్నారు.



శిలాఫలకం ఆవిష్కరిస్తున్న మేయర్ హరి వెంకట కుమారి, ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్

గెడ్డల్లో పూడికలు తొలగించండి



సూర్యాబాగ్ గెడ్డను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ తదితరులు

డాబాగార్డెన్స్ : ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ బుధవారం 31వ వార్డులో పర్యటించారు. వార్డు పరిధి సూర్యాబాగ్ ప్రాంతంలో పర్యటించిన ఎమ్మెల్యే గెడ్డల్లో పేరుకుపోయిన పూడికలు తొలగించాలని, లేనిచో వర్షాల వల్ల గెడ్డలు పొంగి, పరిసర ప్రాంతాల గృహాల్లోకి చేరి, ప్రజలు ఇబ్బంది పడాల్సి వస్తుందని అధికారులను ఆదేశించారు. ఈ ప్రాంతంలో గెడ్డ వద్ద చిన్న ప్రహరీ, గేట్, రాంప్ నిర్మాణం చేపట్టాలని జీవీఎంసీ అధికారులను ఆదేశించారు. పర్యటనలో వార్డు కార్పొరేటర్ బిపిన్‌కుమార్ జైన్, మండల ప్రెసిడెంట్ బాపూ ఆనంద్, మోహన్, రాంబాబు, బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

కస్టమ్స్ కార్యాలయ ఆవరణలో దుర్గా పూజ

డాబాగార్డెన్స్ : దుర్గాదేవి దయతోనే ప్రపంచ సాధికారత సాధ్యమని కస్టమ్స్ చీఫ్ కమిషనర్ సంజయ్ పంత్ పేర్కొన్నారు. విశాఖపట్నం కస్టమ్స్ గ్రూప్-సి ఆఫీసర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పోర్టు సమీపాన కస్టమ్స్ ఆఫీస్ ఆవరణలో ఏర్పాటు చేసిన దుర్గాదేవికి ప్రత్యేక పూజలు చేశారు. మహాన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రతి ఏటా అధికారుల సంఘం ఆధ్వర్యంలో దుర్గాదేవి నవరాత్రులు నిర్వహించడం అభినందనీయమన్నారు. కస్టమ్స్ ప్రిన్సిపాల్ కమిషనర్ ఎస్.శ్రీధర్, జీఎస్టీ కమిషనర్ రుషిగోయల్, అడిషనల్ కమిషనర్ ప్రథమేష్, డిప్యూటీ కమిషనర్ ఎం. రవి శంకర్, కమిషనర్ శ్రీరామ్, గ్రూప్-సి ఉద్యోగుల సంఘం ప్రతినిధులు ఎస్. విశ్వనాథం, లకే చిట్టిబాబు, కె. చార్లెస్, పి. దుర్గరాజు తదితరులు పాల్గొన్నారు.



దుర్గాదేవిని పూజిస్తున్న కస్టమ్స్ చీఫ్ కమిషనర్ సంజయ్‌పంత్

బస్సు యాత్రను జయప్రదం చేయండి

అల్లిపురం : రాష్ట్రంలో ప్రజానీకం ఎదుర్కొంటున్న వివిధ సమస్యల పరిష్కారం కోసం సీపీఎం పార్టీ ఆంధ్రప్రదేశ్ కమిటీ ఆధ్వర్యంలో ప్రజా రక్షణ భేరి పేరుతో మూడు బస్సు యాత్రలు జరుగుతాయని ఆ పార్టీ నగర కార్యదర్శి ఎం.జగ్గునాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. మన్యం జిల్లా సీతమ్మపేట నుంచి, కర్నూలు జిల్లా ఆదోని నుంచి రెండు బస్సు యాత్రలు ప్రారంభమయ్యాయన్నారు. నవంబర్ 2న శ్రీకాకుళం జిల్లా మందసలో మూడవ బస్సు యాత్ర ప్రారంభమవుతుందన్నారు. నవంబర్ 15వ తేదీన విజయవాడలో భారీ బహిరంగ సభ జరుగుతుందన్నారు. ప్రజానీకం పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

నవ కవులకు మార్గదర్శి శ్రీశ్రీ

సీతంపేట: సహృదయ సాహితి సంస్థ ఆధ్వర్యంలో బుధవారం రాజేంద్రనగర్ ప్రిజం కళాశాలలో నిర్వహించిన కవి సమ్మేళనం అలరించింది. సభాధ్యక్షుడు శేఖరమంత్రి ప్రభాకర్ మాట్లాడుతూ కవిత్వం ఉత్తమ విలువలతో కూడినదై సమాజ ఉన్నతికి దోహదపడాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఔత్సాహిక కవులు పూర్వ కవుల రచనలు ఎక్కువగా చదవాలని, నవ కవులకు మార్గదర్శి మహాకవి శ్రీశ్రీ అని తెలిపారు. నేటి నవ కవులందరూ శ్రీశ్రీ సాహిత్యాన్ని చదవాలని సూచించారు. డాక్టర్ కె.జి.వేణు తెలంగాణ ప్రజాకవి గూడ అంజయ్య జీవితం, సాహిత్యం గురించి ప్రసంగించారు. డాక్టర్ డి.వి.సూర్యారావు మాట్లాడుతూ కవి అంటే కృష్ణశాస్త్రి అని, ఆయన భవకవిత్వానికి ఆద్యుడని, సంస్కారవంతమైన కవిత్వం రాశారని తెలియజేశారు. అనంతరం జరిగిన కవి సమ్మేళనంలో రామతాత నీలి మేఘాలలో కవిత, కుమారి ఆశ్రిత ఎందుకీ ఊగిసలాట కవిత, కె.వి.ఎస్.మూర్తి లోకం పోకడ కవిత, కొత్తూరి రమణ పల్లె పడుచు కవిత, చిన సూర్యనారాయణ సమైఖ్య హృదయ సంస్కారం కవిత, రమణమూర్తి పులిలా కవిత చదివి వినిపించారు.



మాట్లాడుతున్న శేఖరమంత్రి ప్రభాకర్

కాలుష్యరహితంగా దీపావళి

సీతంపేట: దీపావళి పండగను కాలుష్య రహితంగా, సంప్రదాయబద్ధంగా జరుపుకుందామని భారత కిసాన్ సంఘ్ జాతీయ నాయకుడు జలగం కుమారస్వామి పిలుపునిచ్చారు. ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో గో ఆధారిత ప్రకృతి రైతుల సంఘం బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మట్టి, ఆవు పేడతో తయారు చేసిన ప్రమిదలో నూనె, నెయ్యి వేసి దీపాలు వెలిగించాలన్నారు. అత్యంత శబ్ద, వాయు కాలుష్యం కలిగించే చైనా దేశానికి చెందిన టపాసులు కాల్చి అనారోగ్యం తెచ్చుకోవద్దని, పశు పక్ష్యాదులకు హాని కలగకుండా పండగ చేసుకోవాలని సూచించారు. వ్యవసాయ శాస్త్రవేత్త అశోక్‌కుమార్ మాట్లాడుతూ పత్తి పండిస్తున్న రైతులను ఆదరించి, వారు పండించిన దూది ఒత్తులతో దీపాలు వెలిగించాలన్నారు. కుమ్మరి తయారు చేసిన ప్రమిదలు, గానుగలో తయారు చేసే నూనె వినియోగించాలని సూచించారు. కార్యక్రమంలో నగర మిద్దె తోటల సంఘం ప్రతినిధి ఎం.ఐశ్వర్య, రైతుల సంఘం అధ్యక్షులు దాట్ల సుబ్రహ్మణ్య వర్మ, సిహెచ్.మురళీధర్ పాల్గొన్నారు.

జోరుగా పింఛన్ల పంపిణీ



కల్లుపాకలు ఏరియాలో పింఛన్లు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు

జగదాంబ : బుధవారం జీవీఎంసీ 35వ వార్డులో అవ్వా తాతాలకు పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఒక్కరోజే 95 శాతం పింఛన్ల పంపిణీ పూర్తయింది. వార్డు కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు సెక్రటరీలతో కలిసి వార్డులో ఇంటింటికీ వెళ్లి పింఛన్ల పంపిణీ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతినెలా ఒకటో తేదీనే ఇంటికి పింఛన్లు పంపిస్తున్న ఘనత జగనన్నదే అన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి పేదలకు పెద్దపీట వేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు నాయకులు, గృహసారథులు, కన్వీనర్లు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే వాసుపల్లి ఔదార్యం



ఉరుకిటి సుజాతకు ఆర్థిక సహకారం అందజేస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్

అల్లిపురం : ప్రజాదర్బార్‌లో వచ్చిన వినతుల మేరకు ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ బుధవారం నియోజకవర్గంలో ఐదుగురికి రూ.25 వేలు తన సొంత నిధుల నుంచి ఆర్థిక సహకారం అందజేశారు. ఊపిరితిత్తుల సమస్యతో బాధపడుతున్న 63 సంవత్సరాల 29వ వార్డు మహారాణిపేట, సెంచరీక్లబ్ ప్రాంతవాసి పాలక రామయ్య కుటుంబ సభ్యుల విజ్ఞప్తి మేరకు వారి ఇంటికి వెళ్లి రూ.5 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. అలాగే బ్రెస్ట్ క్యాన్సర్‌తో బాధపడుతున్న రామజోగిపేట ప్రాంతానికి చెందిన ఉరికిటి సుజాత ఇంటికి వెళ్లి మందుల ఖర్చులకు రూ.5 వేలు అందజేశారు. కిడ్నీ సమస్యతో బాధపడుతున్న 38వ వార్డు వన్‌టౌన్‌లో నివాసి చవ్వాకుల దాసుకు రూ.5 వేలు, పెరాలసిస్‌తో బాధపడుతున్న 31వ వార్డు సూర్యాబాగ్ ప్రాంతానికి చెందిన దొడ్డి అప్పారావుకు రూ.5 వేలు, 27వ వార్డు దొండపర్తి, పాలికలవారివీధికి చెందిన పాల మంగాదేవి పెరాలసిస్‌తో బాధపడుతున్నట్లు తెలుసుకుని ఫిజియో థెరపీ నిమిత్తం రూ.5 వేలు ఆర్థిక సహకారం అందజేశారు. కార్పొరేటర్లు, వార్డు అధ్యక్షులు, మండల అధ్యక్షులు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర, జిల్లా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గౌరీ పరమేశ్వరుల లీలా మహోత్సవాలకు శ్రీకారం



శ్రీ లక్ష్మీ గణపతి హోమం పూర్ణాహుతిలో పాల్గొన్న భక్తులు



పందిరి రాట కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్, జాన్‌వెస్లీ తదితరులు

అల్లిపురం : వేంకటేశ్వరమెట్టపై గల శ్రీ వేంకట గౌరీ శంకర గ్రంథాలయం ఆధ్వర్యంలో నిర్వహించే శ్రీ గౌరీ పరమేశ్వరుల లీలా మహోత్సవాలకు బుధవారం శ్రీకారం చుట్టారు. దీంట్లో భాగంగా గ్రంథాలయం ఆవరణలో అమ్మవారి పందిరి రాటకు బొడ్డేటి ప్రసాద్ దంపతులు పూజలు నిర్వహించారు. అనంతరం గ్రంథాలయం ఆవరణలో శ్రీలక్ష్మీ గణపతి హోమం అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా తోడపెద్దుకు పూజలు చేశారు. గ్రంథాలయం అధ్యక్షుడు భీశెట్టి నరసింహామూర్తి (శ్రీను) మాట్లాడుతూ గత 75 సంవత్సరాలుగా గౌరీ పరమేశ్వరుల ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 11వ తేదీ నుంచి నెల రోజుల పాటు ఉత్సవాలు నిర్వహిస్తామన్నారు. డిశంబర్ 5వ తేదీన అమ్మవారి తిరువీధి ఉత్సవం, గౌరమ్మ సంబరం అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉత్సవాలను పురస్కరించుకుని ప్రతి రోజు అయ్యప్పలు, భవానీలకు భిక్ష, సాయంత్రం గౌరీ హారతి, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్, రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ బొల్లవరపు జాన్‌వెస్లీ, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, జిల్లా ప్రధాన కార్యదర్శి నీలాపు వెంకట రమణారెడ్డి, 33వ వార్డు కార్పొరేటర్ భీశెట్టి వసంతలక్ష్మి, భీశెట్టి గోపి దంపతులు, నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ నాయకుడు ద్రోణంరాజు శ్రీ వత్సవ్, క్లస్టర్ మండల అధ్యక్షుడు కర్రి నీలకంఠం, వ్యాపారవేత్త, సంఘ సేవకుడు పీల వెంకట అప్పలనాయుడు, బీజేపీ నాయకుడు నీలాపు విజయానందరెడ్డి, పచ్చిరిపల్లి రాము, గ్రంథాలయ అధ్యక్ష, కార్యదర్శులు, సంఘం కార్యదర్శి శరగడం మోహన్‌రావు, వైస్ ప్రెసిడెంట్ పాలమర శెట్టి శ్రీను, కోశాధికారి కోరిబిల్లి త్రినాథ్, జాయింట్ సెక్రటరీ కోరిబిల్లి ఆదినారాయణ, సూరిశెట్టి చిట్టినాయుడు, అల్లిపురం గౌరీ సేవా సంఘం, బంగారుమెట్ట గౌరీ సేవా సంఘం అధ్యక్ష, కార్యదర్శులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

రైలు ప్రమాదాలకు కేంద్రం నిర్లక్ష్యమే కారణం



సమావేశంలో మాట్లాడుతున్న సిటు ఆలిండియా అధ్యక్షురాలు హేమలత

డాబాగార్డెన్స్ : రైలు ప్రమాదాలకు కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని, ఇటీవల కొత్తవలస రైల్వే మార్గంలో కంటకాపల్లి వద్ద జరిగిన రైలు ప్రమాదమే అందుకు నిదర్శనమని సిటు ఆలిండియా కమిటీ అధ్యక్షురాలు కె. హేమలత ఆరోపించారు. విశాఖలో సిటు కార్యాలయంలో బుధవారం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నరసింగరావు, రాష్ట్ర కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్‌తో కలిసి విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఉదయం నుంచి ఆటోమేటిక్ సిగ్నల్స్‌లో లోపాలున్నాయని గుర్తించారని, ఈ ప్రమాదానికి ఇదే ప్రధాన కారణమని నిపుణులు భావిస్తున్నారని, ఈ ప్రమాదంలో అక్కడికక్కడే ఇద్దరు లోకో పైలెట్లు, ఒక గార్డ్‌తో సహా 14 మంది మృతి చెందారన్నారు. మరో 30 మంది తీవ్రంగా గాయపడ్డారని తెలిపారు. రైల్వే అధికారులు అసలు లోపాన్ని వదిలేసి, ప్రమాదంలో చనిపోయిన వారిపై నెపం నెట్టడం అన్యాయమన్నారు. విశాఖ డివిజన్‌లోనే గత దశాబ్దంలో మూడు ఘోర ప్రమాదాలు చోటు చేసుకున్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వం బాధ్యులైన అధికారులను కాపాడుతుందని మండిపడ్డారు. భద్రతపై నిర్లక్ష్యం, కాంట్రాక్టీకరణ, లోకో రైళ్లు నడపడంలో ట్రైనింగ్ ఇవ్వకపోవడం, ఎక్కువ పని గంటలు లోకో డ్రైవర్లతో పని చేయించడం వంటివి ప్రమాదాలకు ప్రధాన కారణాలని చెప్పారు. రైల్వేలో ఇప్పటికీ 2.7 లక్షల పర్మినెంట్ ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని వివరించారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా ఈ నెల 26,27,28 తేదీల్లో దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్ర రాజధానుల్లో అఖిలపక్ష కేంద్ర కార్మిక సంఘాలు, సంయుక్త కిషాన్ మోర్చా ఆధ్వర్యంలో మహాధర్నాలు చేపడతున్నట్టు పేర్కొన్నారు. రెండో వారంలో అన్ని రైల్వే స్టేషన్ల వద్ద నిరసన ప్రదర్శనలు చేపడతున్నట్టు తెలిపారు.

మండపాల వద్ద భారీ అన్నసమారాధనలు



35వ వార్డులో అన్నప్రసాదం వడ్డిస్తున్న కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు తదితరులు



జ్ఞానాపురంలో అన్నప్రసాదం వడ్డిస్తున్న కార్పొరేటర్ పూర్ణిమ

జగదాంబ : దసరా ఉత్సవాలను పురస్కరించుకుని పాతబస్టాండ్ వద్ద బుధవారం భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. జీవీఎంసీ 35వ వార్డు ప్రసాద్ గార్డెన్స్ దరి వాహన యాజమానులు ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. అన్నిదానాల కంటే అన్నదానం గొప్పదని కొనియాడారు. వైఎస్సార్‌సీపీ వార్డు నాయకులు పాల్గొన్నారు.

జ్ఞానాపురం రైల్వేస్టేషన్ వద్ద..

కంచరపాలెం : జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురం రైల్వేస్టేషన్ వద్ద దుర్గాదేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా భీమేశ్వర ఆటోస్టాండ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గాదేవికి బుధవారం జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యురాలు, వార్డు కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆమె అన్నసమారాధనను ప్రారంభించారు. సుమారు 2 వేల మందికి అన్నసమారాధన చేసినట్లు కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ క్లస్టర్ ఇన్‌చార్జి కోడిగుడ్ల శ్రీధర్, ఆటోస్టాండ్ సభ్యులు, డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.